ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 16 నవంబరు 2025



పలాస-కాశీబుగ్గ మునిసిపల్ కమిషనర్‌గా శ్రీనివాసులు



పలాస, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపల్ కమిషనర్‌గా ఇ.శ్రీనివాసులు శనివారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన కమిషనర్ ఎన్.రామారావు బదిలీపై వెళ్లారు. ఈయన స్థానంలో గుంటూరు జిల్లా పొన్నూరు మునిసి పాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు పదోన్నతిపై ఇక్కడకు కమిషనర్‌గా వచ్చారు. శ్రీనివాసులకు మునిసిపల్ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆ కష్టమూ.. మహిళలకే..



- కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలకు పురుషులు దూరం
- నేడు ప్రపంచ వాసెక్టమీ దినం

- జిల్లాలో 2023-24 సంవత్సరంలో 11 మంది పురుషులు మాత్రమే వాసెక్టమీ చేయించుకున్నారు.
- 2024-25లో ఒక్కరు మాత్రమే వాసెక్టమీ చేయించుకున్నారు.
- ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ఒక్కరూ వాసెక్టమీ చేయించుకోలేదు.

శ్రీకాకుళం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి)

..ఇదీ జిల్లాలో పురుషులకు సంబంధించి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సల లెక్క. దీనికి భిన్నంగా ట్యూబెక్టమీ శస్త్ర చికిత్సలు చేయించుకుంటున్న మహిళల సంఖ్య ఏటా వేలల్లో ఉంటోంది. ఈ గణాంకాలను బట్టి చూస్తే పురుషులు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకునేందుకు ముందుకు రావడం లేదని అర్థమవుతోంది. పురుషులకు చేసే కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సను వాసెక్టమీగా.. స్త్రీలకు చేసే కు.ని.శస్త్ర చికిత్సను ట్యూబెక్టమీగా పిలుస్తారు. కు.ని.శస్త్ర చికిత్సను భార్యాభర్తల్లో ఒకరు చేయించుకుంటే సరిపోతుంది. వైద్యశాఖ గణాంకాలను బట్టి చూస్తే ఈ శస్త్ర చికిత్సలను మహిళలు మాత్రమే చేసుకోవాలన్న విధంగా పురుషుల తీరు ఉంటోంది. ప్రస్తుతం అత్యధిక శాతం మహిళలకు శస్త్ర చికిత్సల ద్వారా ప్రసవాలు చేయిస్తున్నారు. ఇది దీర్ఘకాలంలో వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని వైద్యులు చెబుతున్నారు. దీనికి తోడు కు.ని.శస్త్ర చికిత్సలనూ మహిళలే చేయించుకోవాల్సి వస్తోంది.

చిన్న శస్త్ర చికిత్స..

సంతానోత్పత్తిని నివారించడానికి పురుషులకు చేసే గర్భ నిరోధక శస్త్ర చికిత్స వాసెక్టమీ. ఇది చిన్న శస్త్ర చికిత్స. పురుషులు మేల్కొని ఉన్నపుడే ఈ ప్రక్రియ జరుగుతుంది. కేవలం శస్త్ర చికిత్స చేసే ప్రాంతంలో మాత్రమే మత్తు ఇస్తారు. పావు గంట వ్యవధిలో వైద్యులు దీన్ని పూర్తి చేసేస్తారు. పిల్లలు కావాలనుకునేవారు దీన్ని మరలా తెరవవచ్చు. కొన్నిసార్లు సాధ్యం కాకపోవచ్చు. అందుకే పిల్లలు వద్దనుకున్నప్పుడే దీన్ని పాటిస్తే మంచిది. చాలా సులువుగా చేసే ఈ చిన్నపాటి శస్త్ర చికిత్సను వద్దనుకునే పురుషులే ఎక్కువ. వివిధ రకాల అనుమానాలు, అపోహలు, భయాలే ఈ శస్త్ర చికిత్సలకు పురుషులు దూరంగా ఉండడానికి కారణం. వైద్యులు ఎంతగా అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నా.. పురుషుల్లో అనుమానాలు తొలగిపోవడం లేదు. వాసెక్టమీ చేసుకున్న పురుషులు ఒక రోజులో కోలుకుంటారు. వెంటనే పనులకు వెళ్లవచ్చు. అదే ట్యూబెక్టమీ అయితే మహిళల పొట్ట కోసి.. శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుంది. దీని వల్ల వారు కోలుకోవడానికి (మిగతా 7వ పేజీలో..)

పట్టు సడలించిన వైద్యశాఖ

గత నాలుగైదు సంవత్సరాలుగా వైద్య ఆరోగ్య శాఖ కుటుంబ నియంత్రణను పెద్దగా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ ఆలోచన తీరు మారడమే దీనికి కారణం. ప్రస్తుత ప్రభుత్వం జనాభా పెరుగుదలపై దృష్టి సారించింది. దేశ ప్రయోజనాల దృష్ట్యా అధిక జనాభా అవసరాన్ని గుర్తించిన పాలకులు... ఎక్కువ మంది పిల్లలకు జన్మనివ్వాలని ప్రజలకు పిలుపునిస్తున్నారు. కానీ పరిమిత కుటుంబ ప్రయోజనాలను ప్రజలు గుర్తించారు. దీంతో ఒకరు లేక ఇద్దరు పిల్లలతో సరిపెడుతున్నారు. ఒకప్పుడు కు.ని. శస్త్ర చికిత్సలకు సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ క్షేత్ర స్థాయిలో పని చేసే సిబ్బందికి లక్ష్యాలు విధించేది. ప్రస్తుతం ప్రజలే ఎవరికి వారుగా ఈ శస్త్ర చికిత్సలకు ముందుకు వస్తున్నారు. అందులోనూ మహిళలే ముందుంటున్నారు. అనేక మంది ప్రైవేటు ఆసుపత్రుల్లో డబ్బులు ఇచ్చి చికిత్సలు చేయించుకుంటున్నారు. పురుషులు కుటుంబ నియంత్రణ చికిత్సలపై అపోహలు వీడాలని వైద్యులు సూచిస్తున్నారు. వాసెక్టమీ శస్త్ర చికిత్స చాలా సులభమైనది. ఎటువంటి కుట్టు, కోత ఉండదు. సైకిల్ తొక్కడం, బండ్లు లాగడం, వాహనాలను నడపడం, బరువులు ఎత్తడం వంటి పనులన్నీ చేయొచ్చని వైద్యులు చెబుతున్నారు.

సమాచారం

ముగ్గురు ఎస్‌ఐలకు అటాచ్‌మెంట్

శ్రీకాకుళం క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముగ్గురు ఎస్‌ఐలకు వేర్వేరు పోలీస్ స్టేషన్లకు అటాచ్ చేస్తూ ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్టు సమాచారం. శ్రీకాకుళం సబ్ డివిజన్ జేఆర్‌పురం సర్కిల్ పరిధిలో లావేరు, ఎచ్చెర్ల, జి.సిగడాం ఎస్‌ఐలకు వేర్వేరు పోలీస్‌స్టేషన్లకు అటాచ్ చేశారు. లావేరు ఎస్‌ఐ లక్ష్మణరావుకు ఎచ్చెర్ల, ఎచ్చెర్ల ఎస్‌ఐ సందీప్‌కు జి.సిగడాం, జి.సిగడాం ఎస్‌ఐ మధుసూదనరావుకు శ్రీకాకుళం టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిసింది.

రేపటి నుంచి కూరగాయల నారు పెంపకంపై శిక్షణ

ఆమదాలవలస, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలసలోని కృషి విజ్ఞాన కేంద్రంలో షేడ్‌నెట్లు ఉపయోగించి ప్రో ట్రే విధానం ద్వారా కూరగాయల నారు తయారీపై మూడు రోజులపాటు ప్రత్యేక శిక్షణ నిర్వహించనున్నట్టు ఉద్యానవన శాస్త్రవేత్త హరికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'నాణ్యమైన ప్రో ట్రే తయారీ, నేల శుభ్రత, విత్తన శుద్ధి నిర్వహణ పద్ధతులు తదితర అంశాలపై ఈ నెల 17 నుంచి 19 వరకు శిక్షణ జరగనుంది. ఈ నైపుణ్య ఆధారిత శిక్షణలో ఆసక్తిగల గిరిజన యువత పాల్గొని.. సాగు పద్ధతులను మరింత ఆధునీకీకరించాల'ని ఆయన తెలిపారు.

సివిల్స్ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సంబంధించి విజయవాడ, గొల్లపూడిలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచితంగా శిక్షణ పొందేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమాధికారి ఇ.అనూరాధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఆసక్తి గల అభ్యర్థులు శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డులోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 17 నుంచి 25వ తేదీలోగా దరఖాస్తులను సమర్పించాలి. అభ్యర్థులకు డిసెంబరు 5న స్క్రీనింగ్ పరీక్ష ఉంటుంది. ఈ పరీక్షలో అర్హత సాధించిన వారికి డిసెంబరు 10 నుంచి విజయవాడలో ఎక్స్‌క్లూజివ్ బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇస్తాం. మరిన్ని వివరాలకు 73829 75679, 83328 52106 నెంబర్లను సంప్రదించాల'ని ఆమె సూచించారు.

ప్రైవేటు బస్సుల్లో గంజాయి రవాణా

- వేర్వేరు కేసుల్లో ఒడిశావాసులు ఇద్దరి అరెస్టు
- పలాసలో మరొకరు పట్టుబడిన వైనం



నరసన్నపేట : మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు, పక్కన ఎస్‌ఐ దుర్గాప్రసాద్, పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

నరసన్నపేట/పలాస, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పోలీసులు ఎన్ని దాడులు చేస్తున్నా.. గంజాయి అక్రమ రవాణా ఆగడం లేదు. నిత్యం ఏదో ఒకచోట గంజాయి ముఠా పట్టుబడుతూనే ఉంది. తాజాగా ప్రైవేటు బస్సుల్లో గంజాయి రవాణా చేస్తూ వేర్వేరుగా ఇద్దరు ఒడిశా వాసులు పోలీసులకు పట్టుబడ్డారు. పలాసలో మరొకరు పట్టుబడగా.. ఆ ముగ్గురినీ పోలీసులు అరెస్టు చేశారు. మొత్తంగా 33.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే..

ఒడిశా నుంచి బెంగళూరు, చెన్నైకి ప్రైవేటు బస్సుల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని మడపాం టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నామని సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్‌ఐ దుర్గాప్రసాద్ శనివారం విలేకరులకు తెలిపారు. శుక్రవారం నరసన్నపేట ఎస్‌ఐ దుర్గాప్రసాద్, పోలీసులు మడపాం టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఓ ప్రైవేటు బస్సులో ఒడిశాకు చెందిన త్రిలోచన మదలి 10.5 కేజీల గంజాయితో పట్టుబడ్డాడు. ఆ గంజాయిని బెంగళూరు తీసుకెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. అలాగే మరో ప్రైవేటు బస్సులో 11 కేజీల గంజాయితో ఒడిశాకు చెందిన తపన్‌కుమార్ మహంతి పట్టుబడ్డాడు. ఆయన ఒడిశా నుంచి చెన్నైకు గంజాయిని రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. వారిద్దరినీ అరెస్టు చేసి.. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరినీ రిమాండ్‌కు తరలించామని సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ దుర్గాప్రసాద్ వెల్లడించారు.



పలాస : మాట్లాడుతున్న కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ

- కిలోకు రూ.5వేలు ఇస్తామనడంతో..

ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా తండిగూడ గ్రామానికి చెందిన సపన్‌కుమార్ బెబరాత 13కిలోల గంజాయితో పట్టుబడ్డాడని (మిగతా 7వ పేజీలో..)

ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నరసన్నపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జమ్ము గ్రామంలో పరిసరాలను పరిశీలించారు. తడిచెత్త, పొడిచెత్త వేరు చేసే విధానంపై మహిళలకు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ పెరటిలో మొక్కలను నాటి... వాటి సంరక్షణ బాధ్యతను ఇంటి పెద్దపేరుతో తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో సరస్వతి విగ్రహానికి పూలమాల వేసి... విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చేతులు శుభ్రం చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో తడిచెత్త, పొడిచెత్త సేకరణ తీరుపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. జమ్మును ఆదర్శంగా తీసుకొని.. మిగతా గ్రామాలు పరిశుభ్రతకు చర్యలు చేపట్టాలని డీపీవో భారతీ సౌజన్యకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పోగోటి ఉమామహేశ్వరి, కాళింగ, పొందర కార్పొరేషన్ల చైర్మన్లు రోణంకి కృష్ణంనాయుడు, దామోదరం నర్సింహ, శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, కత్తిరి వెంకటరమణ, జామి వెంకట్రావు, బోయిన సతీష్, ఎంపీడీవో వెంకటేష్ ప్రసాద్, నిశ్చల, డిప్యూటీ ఎంపీడీవో రమేష్, ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పి.దాలినాయుడు, ఐసీడీఎస్ పీవో శోభారాణి, సర్పంచ్ వాన గోవిందరాజులు, రెడ్డి సతీష్ పాల్గొన్నారు.



జమ్ములో గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

- నేడు రోడ్డు ప్రమాద మృతుల స్మృతి దినం

ప్రయాణం.. కారాదు విషాదం

- జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- నిబంధనలు పాటించని వాహనదారులు
- అజాగ్రత్త, నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోతున్న వైనం

- ఈ నెల 9న శ్రీకాకుళం రూరల్ కొత్తరోడ్డు సమీపంలో హైవేపై రోడ్డు ప్రమాదంలో నామాల వేణు(22) అనే ఓ యువతి మృతి చెందింది. విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం పుణ్యగిరికి చెందిన వినుకోట శ్రీనివాసరావుతో ఆమె ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. రోడ్డుపై నడుస్తున్న ఓ వ్యక్తిని ఢీకొన్నారు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం వెనుక కూర్చొన్న యువతి రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందింది. రోడ్డు దాటుతున్న వ్యక్తి... వాహనాన్ని గమనించినా.. బైక్ నడుపుతున్న వ్యక్తి... వేగం తగ్గించి పయనించినా.. ఆ యువతి ప్రమాదం బారిన పడి ప్రాణాలు కోల్పోయేది కాదు.

- ఈ నెల 12న లావేరు మండలం గుర్రాలపాలెం నుంచి కొంతమంది ఆటోలో టెక్కలి మండలం రావివలస ఎండలమల్లన్న దర్శనానికి వెళ్లారు. తిరిగొస్తుండగా.. జలుమూరు మండలం అచ్యుతాపురం వద్ద ఆ ఆటోను ఓ బొలేరో వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మహిళలు గట్టెం అచ్చియ్యమ్మ (52) గట్టెం పద్మ (25)మృతి చెందారు. ఆ దుర్ఘటన నుంచి ఇప్పటికీ కుటుంబ సభ్యులు కోలుకోలేకపోతున్నారు. ఇటు ఆటో.. అటు బొలేరో వాహనం నడుపుతున్న ఇరు డ్రైవర్లు.. ఎవరికివారుగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ఈ ఘోర నష్టం సంభవించి ఉండేది కాదు.



వేణు మృతదేహం (ఫైల్)



అచ్చియ్యమ్మ (ఫైల్)



పద్మ (ఫైల్)

శ్రీకాకుళం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. వాహనదారుల నిర్లక్ష్యంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈక్రమంలో పలువురు గాయపడుతుండగా.. చాలా మంది ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. మృతుల కుటుంబ సభ్యులకు విషాదాన్ని మిగుల్చుతున్నాయి. ప్రమాదంలో ఎవరైనా మరణిస్తే.. ఆ కుటుంబమంతా అస్తవ్యస్తమైనట్టే. ఆ విషాదాన్ని ఎవరూ తీర్చలేనిది. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలు నివారించాలంటే చైతన్యం, జాగ్రత్త, అవగాహన తప్పనిసరి. వాహనదారులు భద్రతా నియమాలు పాటించాల్సి ఉంది. ఆదివారం రోడ్డు ప్రమాద మృతుల స్మృతి దినం సందర్భంగా ఈ కథనం. ప్రమాద ఘటన నుంచి ప్రాణాలతో బయటపడి నవారు.. ప్రమాదం ఎలా జరిగింది... తప్పు ఎవరిదన్నదీ చెబుతారు. రెండు వాహనాల ఢీ లేదా... రోడ్డు డివైడర్‌ను బైక్ ఢీకొనడం.. ఆటోలను, కారులను.. లారీలు.. ట్రాక్టర్లు ఢీకొనడం.. ఇటువంటి ఘటనల్లో వాస్తవంగా ఎవరో ఒకరి తప్పు కచ్చితంగా ఉంటోంది. నిబంధనలు పాటించకపోవడం.. అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్ చేయడం.. మితి మీరిన వేగం... నిర్లక్ష్యం వంటివి కారణమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వాహనదారులు నిబంధనలు పాటించాలి ఉంది. తన వల్ల మరొకరికి ప్రమాదం జరగకూడదని, తనతోపాటు.. ఇతరులు కూడా సురక్షితంగా ఉండాలనే ధోరణితో ఆలోచించాలి. అన్నింటికంటే ప్రాణం అత్యంత విలువైనదనే విషయాన్ని గమనించాలి. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడమేకాకుండా.. స్వీయరక్షణతో నిబంధనలు పాటించాలి. కారు నడిపేవారు కూడా సీటు బెల్టు ధరించి.. కారులో ఉన్నవారి ప్రాణాలకు భద్రత కల్పించేలా డ్రైవింగ్ చేయాలి. ఆటో, లారీ, (మిగతా 7వ పేజీలో..)



వైభవంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష దైవం, ఆరోగ్యప్రదాత అరసవల్లి శ్రీ సూర్య నారాయణ స్వామి వారికి శనివారం కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉష, ఛాయ, పద్మినీ సమేతంగా ఆదిత్యుడు స్వామిని ఆలయ అనివెట్టి మండపంలో కొలువుదీర్చి.. ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి సందీపశర్మ, తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్ చేస్తే.. ఉన్నచూపు పోయింది

- జిల్లా కేంద్రాసుపత్రిలో వైద్యుడి నిర్లక్ష్యంపై ఫిర్యాదు

టెక్కలి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి మండలం జర్జంగికి చెందిన జీరు ఎర్రయ్య.. వైద్యుడి నిర్లక్ష్యం కారణంగా తనకు కంటి చూపు పోయిందని ఆరోపించారు. దీనిపై సూపరింటెండెంట్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. జీరు ఎర్రయ్య తనకు కంటిచూపు మందగించిందని టెక్కలిలో జిల్లా కేంద్రాసుపత్రిలో సెప్టెంబరు 16న నేత్రవైద్యుడు ఎస్.శ్రీకాంత్‌కు చెప్పారు. ఆయన సూచన మేరకు కంటి ఆపరేషన్ చేయించుకున్నారు. ఇంటికి వెళ్లిపోయిన నాలుగు రోజుల తర్వాత ఎర్రయ్య కంటి నుంచి నీరు కారుతూ వాపు కనిపించింది. దీంతో ఎర్రయ్య మరోసారి సెప్టెంబరు 22న కంటి వైద్యులు వద్దకు వచ్చి చూపించాడు. దీంతో మళ్లీ 25న కంటి ఆపరేషన్ చేశారు. నీరు కారడం, వాపు నెమ్మదిగా తగ్గుతుందని వైద్యుడు తెలిపారు. కాగా రీ ఆపరేషన్ చేసిన తర్వాత కూడా అదే పరిస్థితి. దీంతో ఎర్రయ్య తన కుమారుడు కిషోర్‌ను వెంటబెట్టుకొని విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రికి వెళ్లి కంటి పరీక్ష చేయించారు. మీకు ఎన్నిచేసినా కన్ను కనిపించదని ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి వైద్యులు చెప్పడంతో ఒక్కసారిగా ఖంగుతిన్నారు. ఎర్రయ్య, ఆయన కుటుంబ సభ్యులు శనివారం టెక్కలిలో జిల్లా కేంద్రాసుపత్రికి చేరుకుని వైద్యుడి నిర్లక్ష్యం కారణంగా తనకు ఉన్న చూపు పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.సూర్యారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ విషయమై కంటి వైద్య నిపుణులు ఎస్.శ్రీకాంత్ వద్ద ప్రస్తావించగా.. 'ఎర్రయ్యకు కంటి ఆపరేషన్ చేశాం. కుట్లు తీసేటప్పుడు బ్లీడింగ్ జరిగింది. మరోసారి కంటి నరం పరిశీలించాల్సిన అవసరం ఉంది. హెచ్‌వోడీ సెలవుపై ఉన్నందున ఆయనతో మాట్లాడిన తరువాత పరిశీలిస్తామ'ని తెలిపారు.



సూపరింటెండెంట్ సూర్యారావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎర్రయ్య



గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు ఎంవోయూ

- సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సమక్షంలో అవగాహన ఒప్పందం

7లో

క్రమశిక్షణ, సమర్థతతో పనిచేయాలి

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

7లో

తూకంలో అక్రమం

- రేషన్ దుకాణంలో దోపిడీ
- మోసపోతున్న లబ్ధిదారులు

8లో

రైతు ప్రయోజనాలకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పొందూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు, వీటిని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. పొందూరులో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రైతుల నుంచి ప్రతి గింజా కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, ఉపాధ్యక్షుడు బాదాన గిరి, నాయకులు శ్రీరంగనాయకులు, బి.శంకర్ భాస్కర్, చినరంగా, నారాయణరావు, బాల, జనక చక్రవర్తి పాల్గొన్నారు.

బాలల దినోత్సవంలో అరుదైన అవకాశం

● రాష్ట్రపతిని కలిసిన విద్యార్థులు


రాష్ట్రపతితో స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు

రణస్థలం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఆంధ్ర ప్రదేశ్ నుంచి నలుగురు విద్యార్థులకు బాలల దినోత్సవంలో భాగంగా న్యూఢిల్లీ రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించింది. రణస్థలం నుంచి ఇద్దరు. అనకాపల్లి నుంచి ఇద్దరు విద్యార్థులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసే అవకాశం కలిగింది. రణస్థలం మండలం ఐరిస్ సాకల్య స్కూల్ నుంచి కొమనాపల్లి లాస్యశ్రీ (7వ తరగతి), నౌకట్ల యశ్వంత్ (9వ తరగతి) హాజర య్యారు. తమ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులకు రాష్ట్రపతిని కలిసే అవకాశం రావడంపై డైరెక్టర్ కొమనాపల్లి హరికృష్ణ, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు స్కౌట్ అండ్ గైడ్స్ రాష్ట్ర చైర్మన్ ఎం.సాయి, కార్యదర్శి బి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై దృష్టి సారించండి


ఆమదాలవలస, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో ఇంటి, నీటి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని కమిషనర్ తమ్మినేని రవి అన్నారు. శనివారం కార్యాలయంలో సచివాలయ అడ్మిన్, సెక్రటరీలు, ఎమినిటి సెక్రటరీలు, సచివాలయ నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో పన్ను వసూలు పురోగతిని రోజు వారి సమీక్షించి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు.

వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా స్వప్నవాహిని


డాక్టర్ ఉదయభాస్కర్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న స్వప్నవాహిని

ఎచ్చెర్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూని వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.స్వప్నవాహిని శని వారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ డా.ఎస్.ఉదయభాస్కర్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఈమె మూడేళ్ల పాటు ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తారు. ఆమెను వర్సిటీ అధికారులు అభినందించారు. ఈమె అకడమిక్ అఫైర్స్ డీన్‌గా, రాజ్‌భవన్ వర్సిటీ కోఆర్డి నేటర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.

ఘనంగా అభిషేకాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ


ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిదంబరేశ్వర ఆలయం పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన అభిషేకాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ శనివారం ఘనంగా నిర్వహించారు. శివాలయం ఎక్కన ఉన్న కోనేరు నుంచి కలశాలతో నీరు తీసుకువచ్చి స్వామికి అభిషేకం చేశా రు. అలాగే మహాదీప స్థాపన, మండల పూజ, మహాస్నానం, హోమాలు, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయమ్మ, విగ్రహ దాత సాలిన గంగులు, శంకర్, గాంధీ, ధనుష, స్వాతి తదితరులు ప్రత్యేక పూజలు చేపట్టారు.

రుచిగా, శుచిగా పదార్థాలు అందించాలి


క్యాంటీన్‌ను పునః ప్రారంభిస్తున్న వీసీ కేఆర్ రజని

ఎచ్చెర్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూని వర్సిటీ లో క్యాంటీన్‌ను పూర్తిస్థాయి వసతులతో డైనింగ్, కిచెన్ మరింత ఆధునీకీకరించి, పరిసర ప్రాంతాలను ఆహ్లాదకరంగా తయారుచేశారు. ఈ మేరకు క్యాంటీన్‌ను వీసీ, ప్రొఫెసర్ కేఆర్ రజని శని వారం పునః ప్రారంభించా రు. శుచిగా, రుచిగా ఆహార పదార్థాలను వండి విద్యార్థులకు అందిం చాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, పూర్వపు రిజి స్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎం.అనూరాధ, డాక్టర్ సీహెచ్ రాజశేఖరరావు, డాక్టర్ కె.స్వప్నవాహిని తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సుల్లో గంజాయి రవాణా

(ఐదో పేజీ తరువాయి)

కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. పర్లాకిమిడిలో తారక బారికో అనే వ్యక్తి నుంచి సపన్ కుమార్ బెబరాత రూ.2వేలకు గంజాయి కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి బస్సులో నేరుగా కాశీబుగ్గ చేరుకున్నాడు. అనంతరం బ్యాగుతో పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో వెళ్తుండగా ఎస్ఐ నర్సింహమూర్తి సాధా రణ తనిఖీలు చేస్తుండగా తారసపడ్డాడు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా సపన్ కుమార్ బెబరాతను పట్టుకున్నారు. బ్యాగ్‌ను తనిఖీ చేయగా గంజాయి బయట పడింది. ఈయన మహా రాష్ట్ర రాష్ట్రం షోలాపూర్‌కు చెందిన వ్యాన్ డ్రైవర్ రవిగంగారామ్‌కు కొన్నాళ్ల కిందట పరిచయమ య్యాడు. ఒడిశా నుంచి గంజాయి తీసుకుని తనకు అప్పగిస్తే కిలోకు రూ.5వేలు ఇస్తానని చెప్పడంతో దురాశతో గంజాయి రవాణాకు సపన్‌కుమార్ అంగీకరించి నట్టు పోలీసుల విచారణలో తేలింది. ఈ క్రమంలో పర్లాకిమిడి నుంచి గంజాయి తెస్తూ పట్టుబడిన సపన్‌కుమార్‌ను అరెస్టు చేసి కోర్టుకు తరలించామని సీఐ సూర్యనారాయణ తెలిపారు.

ఆ కష్టమూ మహిళలకే...

(ఐదో పేజీ తరువాయి)

ఎక్కువ సమయం పడుతుంది. కొన్ని రోజుల వరకు పనులు చేసేందుకు అవకాశం ఉండదు. ఒక్కోసారి పొట్టలో ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదమూ ఉంది. వాసెక్టమీకి ఇతర ఇబ్బందులు ఉండవు. కానీ ఈ శస్త్ర చికిత్స చేసుకున్న పురుషుల శరీరంలో శక్తి ఉండదని.. బరువు పనులు చేయలేరని.. లైంగిక సామర్థ్యం తగ్గు తుందనే అపోహలు ఉన్నాయి. అత్యధిక కుటుంబాలు పురుషుల సంపాదనపై ఆధారపడినవే. ఇది కూడా వాసెక్టమీల సంఖ్య తగ్గడానికి ఓ కారణంగా చెబుతున్నారు.

క్రమశిక్షణ, సమర్థతతో పనిచేయాలి

● ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి


కోర్టు కానిస్టేబుళ్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, సమర్థతతో విధులు నిర్వహించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసుల విచారణలో కోర్టు సంబంధిత వ్యవహారాలు వేగవంతం, కేసుల చార్జిషీట్ల దాఖలులో లోపాలు లేకుండా చూడాలన్నారు. నిందితుల హాజరు, సమన్లు, వారెంట్ల అమలు తదితర అంశాలపై శ్రద్ధ వహించాలన్నారు. నిర్ణీత సమయంలో ముఖ్యమైన కేసుల చార్జిషీట్‌లు కోర్టులో దాఖలు చేయాలన్నారు. కేసుల విచారణ సమయంలో సాక్షులు హాజరుపర్చడం, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయం ముఖ్యమన్నారు. కేసుల రికార్డులను సక్రమంగా నిర్వహించడం కోర్టు కానిస్టేబుళ్ల బాధ్యత అని అన్నారు. సమావేశంలో డీసీఆర్బీ సీఐ శ్రీనివాస్, పాల్గొన్నారు.

పంటల నమోదు జాబితాల ప్రదర్శన

సోంపేట రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్-2025 సంబంధించిన పంట నమోదు వివరాల తుది జాబితా రైతు సేవా కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో ప్రదర్శిస్తారని ఏవో నరసింహమూర్తి అన్నారు. సుంకిడిలో గ్రామసభను శనివారం పరిశీలించారు. రైతులు తమ వివరాలు పరిశీలించుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతు సేవా కేంద్రాల్లో నిర్వ హిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకుని కనీస మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు చరణ్, వీఆర్వో తిరుపతి, పలువురు రైతులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కుష్ఠువ్యాధి సర్వే

ఆమదాలవలస, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు కుష్ఠువ్యాధి (ఎల్‌సీడీసీ) సర్వేని చేపడుతున్నట్లు పీహెచ్‌సీ వైద్యురాలు బి.సాహితి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజల్లో కుష్ఠువ్యాధి అవగాహన కలిగించడం, ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తించి చికిత్స అందించడం ఉద్దేశమన్నారు. ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి బాధితుల వివరాలు సేకరించాలని ఆమె సూచించారు.

మృతుడి తల్లికి నష్టపరిహారం అందజేత

ఇచ్ఛాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండపల్లి ఎంపీపీ పాఠశాలలలో ఉపాధ్యాయుడు (ఎస్జీటీ) పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన రత్నాకర్‌పతి కుటుంబానికి నష్టపరిహారం మంజూరైంది. రత్నాకర్ పతి 2021 అక్టోబరులో మృతి చెందారు. అయితే కారుణ్య నియామకం పొందేందుకు ఆయన కుటుంబంలో ఎవరూ అర్హత కలిగిన వారు లేకపోవడంతో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఎక్స్‌గ్రేషియా నిమిత్తం ఎంఈవో కె.అప్పారావు ఉమాశంకర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు డీఈవో రూ.8 లక్షలు నష్ట పరిహారం మంజూరు చేస్తూ ప్రొసీడింగ్స్‌ను పంపారు. ఈ మేరకు ఈ కాపీని మృతుడి తల్లి సులోచనాపతికి అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జనరల్ సెక్రటరీ ఉమాశంకర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

గార, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రబీలో మొక్కజొన్న, పెసర, మినుము తదితర పంట సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జీఎస్ రాయ్ అన్నారు. ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజనలో భాగంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం గొంటి, నిజామాబాద్ రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏడీఏలు ఎల్. విజయ, బి.రజని, వ్యవసాయాధి కారి దుంపల పద్మావతి, సర్పంచ్ చల్ల శ్రీనివాసరావు, ఎంపీసీటీ సభ్యులు కోట రామారావు, బైరి ప్రమీల, వరహాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగిపై శ్రీకాకుళం టూటౌన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నగరంలోని ఓ కన్‌స్ట్రక్షన్స్‌లో పనిచేస్తున్న షావుకారి భార్గవ్ బిల్డింగ్ ప్లాన్ అనుమతులు ఇప్పిస్తానని చెప్పి ఫోర్జరీ డాక్యుమెంట్లను సృష్టించి 11 మంది వ్యక్తుల నుంచి సుమారు రూ.12.80 లక్షల వసూలు చేశాడు. అయితే అతడు ఇచ్చిన బిల్డింగ్ ప్లాన్ అనుమతులు, పత్రాలు సరైనవి కావని నిర్ధారించుకొని బాధితులు శ్రీకాకుళం టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన టూ టౌన్ సీఐ ఈశ్వరరావు షావుకారి భార్గవ్‌పై చీటింగ్ కేసు నమోదు చేశారు.

గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు ఎంవోయూ

● సీఎం, కేంద్రమంత్రి సమక్షంలో అవగాహన ఒప్పందం



పెట్టుబడిదారులతో రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గంలో నిర్మించ తలపెట్టిన గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుకు సంబంధించి కీలక ఎంవోయూ ఒప్పందం విశాఖలో సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌లో జరిగింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర పౌరవిమానయాన మంత్రి కింజరాపు రామ్మో హన్‌నాయుడు సమక్షంలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. మౌలిక వస తులు, రెగ్యులేటరీ అనుమతులపై ఈ రెండు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి. అలాగే నేచురల్ ఫార్మింగ్ విషయంలో ఏపీకి ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. ఇందుకు గాను పెట్టుబడిదారుల విశ్వా సానికి కొత్త ఊపిరి లభించిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు

● 13 మంది బైండోవర్


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో, డీఎస్పీ

ఇచ్ఛాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఘర్షణలకు దిగితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆర్డీవో జి.వెంకటేష్, డీఎస్పీ డి.లక్ష్మణరావు హెచ్చరించారు. శుక్రవారం రాత్రి డొంకూరు గ్రామంలో ఇరువర్గాల మత్స్యకారుల మధ్య కొట్లాట జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శని వారం వారు పర్యటించి కొట్లాటకు దారి తీసిన పరిస్థితులను ఇరువర్గాల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ స్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇకపై ఘర్షణలకు దిగితే కేసులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి 13 మందిని బైండోవర్ చేయడం జరిగిం దని, సోమవారం పలాస ఆర్డీవో కార్యాలంలో గ్రామపెద్దలకు కౌన్సెలింగ్ ఇవ్వనున్నామన్నారు. అందరూ హాజరుకావాలన్నారు. ఘర్షణ పడిన వ్యక్తులు ప్రతీరోజు పోలీస్ స్టేషన్‌కు హాజరు కావాలని ఆదేశించారు. ప్రస్తుతం గ్రామం ప్రశాంతంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీఐ ఎం.చిన్నమనాయుడు, డీటీ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో 8 మందికి గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం ఇద్దరిని టెక్కలి ఆసుపత్రికి తరలించగా మరో ఆరుగురు చికిత్స అనంతరం డిశ్చార్జి అయ్యారు.

సమాజాభివృద్ధిలో వలంటీర్లు కీలకపాత్ర వహించాలి

● జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్


ఎన్ఎస్ఎస్ పతాకాన్ని ఎగుర వేస్తున్న జిల్లా యువజన అధికారి వెంకట్ ఉజ్వల్

శ్రీకాకుళం రూరల్ నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కీలకపాత్ర వహించాలని జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్ అన్నారు. నైర వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో చల్లపేట గ్రామంలో ప్రత్యేక ఎన్ఎస్ఎస్ శిబిరం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్ఎస్ఎస్ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామాల్లో పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ఆరోగ్యం, పౌష్టికాహారం, సాంకేతిక పరిజ్ఞానం, మొక్కల పెంపకం, అక్షరాస్యత తదితర అంశాలపై చైతన్యం చేయాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డా.కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. పెరటి తోటల పెంపకం, చిరుధాన్యాలకు విలువల జోడింపు, సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవ గాహన కల్పించాలన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలో స్వచ్ఛ భారత్ ర్యాలీ నిర్వహించి, కాలువలు శుభ్రపరిచారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పైలా నవీన్, సర్పంచ్ నరేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డా.రవికుమార్, డా.గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు. నైరా వ్యవసాయ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమాలతోనే బిహార్ ఎన్నికల్లో బీజేపీ విజయం

● 'ఓట్ చోర్.. గద్దె ఛోడ్'పై ప్రచారం


రైలు ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పూడి కిరణ్

కంచిలి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): 'ఓట్ చోర్.. గద్దె ఛోడ్'పై శనివారం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పూడి కిరణ్‌కుమార్ రైల్వే స్టేషన్ ఆవరణలో ప్రయాణికులకు అవగాహన కలిగించారు. ఈ మేరకు కరపత్రాలను ఆవిష్కరించి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికులకు అందించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిహార్, హర్యానా రాష్ట్రాల్లో ఓట్ చోరీ ఎలా జరిగిందో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆధారాలతో నిరూపించారన్నారు. మొదటి నుంచి బిహార్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని చెబుతున్నారని, తాజా ఎన్నికల ఫలితాల్లో అది రుజువైందన్నారు. బీజేపీ, ఎన్నికల కమిషన్ చేస్తున్న ఓట్ చోరీ మోసాన్ని ప్రజలు క్షమించరన్నారు. ఈనెల 21వ తేదీన విజయవాడలో ఏపీ ఎలక్షన్ కమిషన్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ఓట్ చోరీపై నిరసన కార్యక్రమంలో యువత పాల్గొనాలని కోరారు.

ప్రయాణం.. కారాదు విషాదం

(ఐదో పేజీ తరువాయి)

ట్రాక్టర్లు.. ఇలా తదితర వాహనాలను నడిపేవారు సైతం సంయమనం పాటిస్తూ.. తన నిర్లక్ష్యం వల్ల ఏఒక్కరి ప్రాణాలు పోకూడదని తలంపుతో బాధ్యతగా డ్రైవింగ్ చేస్తే చాలు.. ప్రమాద రహిత జిల్లాగా మారుతుందని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

వారి బాధలు చెప్పలేనివి..

రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలు, బాధిత కుటుంబాలు పడుతున్న వ్యథ అంతా ఇంతా కాదు. ప్రమాదం జరిగినప్పుడు కనికరం చూపే వారు తరువాత పట్టించుకోరు. సొంతవారు సైతం అయ్యోపాపం అనడమే తప్ప ఆదుకోవడం అరుదు. ప్రధానంగా ఇంట్లో పిల్లలు ప్రాథమిక విద్య చదువుతున్నప్పుడు ఇంటి పెద్దను కోల్పోతే ఆ కుటుంబ వ్యథ అంతా ఇంతా కాదు. చేతికి అందివచ్చే కుమారుడు లేకపోతే తల్లిదండ్రుల బాధ చెప్పలేనిది. అందుకే రోడ్డు ప్రమాదం అంటే ఒకరి సమస్య కాదు. ఎన్నో కుటుంబాలతో ముడిపడే అంశం అన్న విషయాన్ని గ్రహించాలి. అందుకే ఇంటి నుంచి బయటకు వెళ్లేవారు తమ ప్రయాణాల సమయంలో కుటుంబాన్ని గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉంది.

న్యూస్ బాక్స్

పైడితల్లి అమ్మవారి సేవలో..


న్యాయాధికారికి అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

పొందూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఇలవేల్పు పొందూరు గ్రామ దేవత పైడితల్లి అమ్మవారిని అదనపు జిల్లా న్యాయాధికారి ఫణికుమార్ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అమ్మవారి చిత్రపటాన్ని ఆలయ కమిటీ సభ్యులు అం దించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యుడు ఎ.శివకుమార్, సర్పంచ్ ఆర్.లక్ష్మీ, ఈవో మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు

సోంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అనధికారంగా మద్యం దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ జీవీ రమణ స్పష్టంచేశారు. స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు 43 బెల్టుషాపులపై కేసులు నమోదు చేసి 90 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశామన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న పలువురిని శనివారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఇకపై బెల్టుషాపులు నిర్వహించరాదని హెచ్చరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

బూర్జ/ఆమదాలవలస, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బూర్జ మండలంలోని పలు గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారి వైద్య ఖర్చుల నిమిత్తం, చికిత్స పొందు తూ మృతి చెందిన వారి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ మంజూరైంది. ఈ మేరకు బూర్జ, ఆమదాలవలసల్లో బాధిత కుటుంబాలకు ఈ చెక్కులను శనివారం అందజేశారు. 9 మంది బాధితులకు రూ.7,01,954 విలువ గల చెక్కులను అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, ఎమ్మెల్యే సతీమణి కూన ప్రమీల, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు


పుష్పాలంకరణలో వసంతేశ్వర స్వామి

గార, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా శనివారం ఉదయం శైవ, వైష్ణవ దేవాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రసిద్ధ శ్వేతగిరిపై వెలసిన వీర వసంతేశ్వర స్వామి సన్నిధిలో ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు మహేంద్రాడ రవికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

సర్వేను వినియోగించుకోండి

కంచిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపడుతున్న స్వామిత్వ సర్వేను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వి.తిరుమలరావు అన్నారు. కొల్లూరు పంచాయతీలో స్వామిత్వ గ్రామసభను శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇంటికి సంబంధించిన పట్టాలు లేనివారు ఈ సర్వేలో నమోదు చేసుకొని ఇళ్ల పట్టాలు పొందవచ్చన్నారు. పట్టాల్లో తప్పులున్నట్లయితే సవరణ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీవో ధనుంజయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'పుస్తక మహోత్సవం'


పుస్తకావిష్కరణ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ, రచయిత అట్టాడ అప్పలనాయుడు

శ్రీకాకుళం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏడురోడ్ల కూడలి వద్ద మునిసిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న సిక్కోలు పుస్తక మహోత్సవం కొనసాగుతోంది. ఐదో రోజు శనివారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 'తిమిరాన్ని తరిమేస్తాం' పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు తదితరులు ఆవిష్కరించారు. అనంతరం వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జిల్లాకు చెందిన వాసుదేవాచారి ఆలపించిన గజల్స్ ఆకట్టుకున్నాయి. గొర్లె సన్యాసిరావు బృందం ఎరుకుల పాట, జోష్ శివ బృందం డ్యాన్సులతో వీక్షకులను కట్టిపడేశాయి.


గొర్లె సన్యాసిరావు బృందం ఎరుకుల పాట


గజల్ ఆలాపన చేస్తున్న వాసుదేవాచారి

తూకంలో అక్రమం

- రేషన్ దుకాణంలో పబ్లిక్‌గా దోపిడీ
- మోసపోతున్న లబ్ధిదారులు
- పట్టించుకోని యంత్రాంగం

హిరమండలం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రంలో కనిపిస్తున్న ఎలాక్ట్రానిక్ తూకం యంత్రం మండలంలోని ఒక గ్రామంలోని రేషన్ డిపోలోనిది. ఖాళీగా ఉన్న యంత్రంపై గల డిస్‌ప్లే లో నాలుగు సున్నాలు చూపించాల్సి ఉండగా 240 గ్రాములు చూపిస్తుంది. ఈ యంత్రం మరమ్మతుకు గురైందని అనుకునేరు. కొంచెం కిందకు తూకం యంత్రం ప్లాట్‌ఫారం వైపు చూడండి కొద్దిగా బియ్యం కనిపిస్తున్నాయి. ఇలా ప్లాట్ ఫారంపై బియ్యం ఉంచి రేషన్ లబ్ధిదారుల కళ్లెదురుగానే బహిరంగంగా దోచేస్తున్నారు సదరు డీలరు. వివరాల్లోకి వెళ్తే.. హిరమండలంలోని ఓ గ్రామ కాలనీలోని నిర్వహిస్తున్న రేషన్ డిపోలో బియ్యం తూకంలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఇక్కడ సుమారు 800 రేషన్ కార్డులు ఉన్నాయి. లబ్ధిదారులు డిపోకి వెళ్లి రేషన్ విడిపించే సమయంలో బియ్యం ఇచ్చేటప్పుడు వేయింగ్ యంత్రంపై తూకం వేస్తున్నారు. ఆ సమయంలో మిషన్ ప్లాట్‌ఫారంపై 240 గ్రాముల బియ్యం ముందుగానే ఉంచి తూకం వేస్తున్నారు. దీంతో బియ్యం తీసుకున్న లబ్ధిదారులకు తూకంలో 240 గ్రాములు తక్కువగా వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూకంలో అక్రమాన్ని గుర్తించి డీలర్‌ను అడిగితే ఏవేవో కారణాలు చెబుతున్నట్టు లబ్ధిదారులు చెబుతున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ ఎన్ని జోగారావు దృష్టికి తీసుకువెళ్లగా.. సీఎస్‌డీటీని పంపించి తనిఖీ చేయించి చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.


వేయింగ్ మిషన్‌పై ముందే ఉంచిన బియ్యం.. బరువు 240 గ్రాములుగా చూపిస్తున్న దృశ్యం

ఈత కొట్టేందుకు వెళ్లి..

- చెరువులో మునిగి విద్యార్థి మృతి
- రుషికుద్ద గ్రామంలో విషాదం


హర్ష (ఫైల్)

సోంపేట రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సరదాగా ఈత కొట్టేందుకు స్నేహితులతో వెళ్లిన ఓ విద్యార్థి హడ్డిబంద చెరువులో పడి మృతి చెందిన ఘటన రుషకుద్ద గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బొడ్డు ధర్మరాజు, లక్ష్మీ దంపతులకు ఇద్దరు పిల్లలు. తొలిసంతానం అయిన హర్ష (16) సోంపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. శనివారం సెలవు కావడంతో ఇద్దరు స్నేహితులతో కలిసి చెరువులో ఈతకొట్టేందుకు వెళ్లాడు. హర్షతో వెళ్లిన ఇద్దరికి ఈత రావడం వల్ల ఒడ్డుకు చేరుకున్నారు. హర్షకు ఈత రాకపోవడంతో జీలుగ ముక్క సాయంతో కొద్దిసేపు ఈతకొట్టగా అది విరిగిపోవడంతో చెరువులో మునిగిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న సోంపేట అగ్నిమాపక అధికారి సూర్యారావు చెరువు వద్దకు చేరుకొని సిబ్బందితో కలిసి గాలించగా.. లోతు ఎక్కువ ఉండడంతో ఫలితం లేకపోతుంది. స్థానిక మత్స్యకారుల సాయంతో చెరువులో తెప్పలతో గాలించగా హర్ష మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు చేర్చారు. మృతదేహానికి సోంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబం సభ్యులకు అప్పగించారు. హర్ష తండ్రి కర్రల మిల్లులో రోజు కూలీగా పనిచేస్తూ పిల్లలను చదివిస్తున్నాడు. కుమారుడు మృతి చెందాడన్న విషయం తెలుసుకుని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. హర్ష మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం


ఎమ్మెల్యే ఇంటికి సమీపంలో బోల్తా పడిన లారీ

పలాస, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పలాస బైపాస్ రోడ్డు శాసనం జంక్షన్ వద్ద శనివారం మధ్యాహ్నం లారీ బోల్తా పడింది. అందులో ఉన్న డ్రైవర్, క్లీనర్లు ప్రాణాపాయం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఇంటికి సమీపంలోనే ఈ ప్రమాదం జరగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సకాలంలో చేరుకొని ఆ లారీని అతికష్టంపై బయటకు తీశారు. జంషెడ్‌పూర్ నుంచి ఐరన్ ప్లేట్లతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు వెళ్తున్న క్రమంలో యు టర్నింగ్ వద్ద మరోలారీ వెళ్తుండడంతో దీన్ని తప్పించబోయి లారీ రోడ్డు పక్కన బోల్తా పడింది. ఘటన స్థలానికి కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కాగా ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఫ్లైఓవర్ నుంచి దిగువకు వేగంతో వాహనాలు వస్తున్న క్రమంలో యు టర్నింగ్ వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలకు కారణంగా తెలుస్తున్నాయి.

పెండింగ్ కేసుల రాజీకి యత్నించండి


అధికారులతో సమీక్షిస్తున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి వాణి

నరసన్నపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు రాజీ అయ్యేలా ప్రయత్నించాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్, జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.వాణి సూచించారు. శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో పోలాకి, నరసన్నపేట, ఎక్సైజ్ స్టేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యాక్రమంలో ఏపీపీ ఆర్ఎస్ సంతోషి, ఏజీపీ వి.శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావాడ కొండలరావు, న్యాయవాదులు టి.మధుసూదనరావు, డి.ప్రశాంతి, గొండు అప్పారావు, సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐలు దుర్గాప్రసాద్, రంజిత్, ఎక్సైజ్ ఎస్ఐ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న న్యాయాధికారి కిశోర్‌బాబు

మందస, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయాధికారి కిశోర్ బాబు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలతో మహిళా అభ్యున్నతిపై అవగాహన సదస్సు నిర్వహించారు. అదే విధంగా మహిళలు తమకు కలిగిన బాధలను చెప్పుకోలేని స్థితిలో ఉంటారని, వారికి ప్రభుత్వం కల్పించిన చట్టాలపై అవగాహన ఉంటే పోరాడి న్యాయం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మిస్క శ్రీకాంత్, ఎంపీడీవో వెంకటరమణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోడ శైలేంద్ర, కమిటీ సభ్యులు కృష్ణంరాజు, న్యాయవాది వై.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాల వితరణ


కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పలాస, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చేతన ఫౌండేషన్ (విజయనగరం) ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు అందజేశారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లాతోపాటు ఒడిశా రాష్ట్రం గంజాం, గజపతి జిల్లాలకు చెందిన దివ్యాంగులకు వీటిని అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఫౌండర్ కేశవ్‌కృష్ణ మాట్లాడుతూ.. దివ్యాంగులు ఎంతో మంది ఉన్నారని, వారందరికీ ఉదారంగా సేవచేయడానికి తాము ఫౌండేషన్ ఏర్పాటు చేశామన్నారు. గాయత్రి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొర్ల కన్నారావు, గురుదేవ చారిటబుల్ ట్రస్టు, మదర్ వలంటీర్ ఆర్గనైజేషన్ సంస్థ ప్రతినిధులు, సీతారామ్, సురేష్, మిశ్రా, రాపర్తి జగదీష్ పాల్గొన్నారు.

బిహార్ ఫలితాలపై బీజేపీ నేతల సందడి


టెక్కలిలో సందడి చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

టెక్కలి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బిహార్ ఫలితాలు వికసిత్ భారత్‌కు సోపానమని బీజేపీ నాయకులు అన్నారు. శనివారం అంబేడ్కర్ జంక్షన్‌లో బీహార్ ఫలితాలపై బాణాసంచ కాల్చుతూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జర్జాన రామ్‌జీ, బూరె నరేంద్ర చక్రవర్తి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెళియాపుట్టి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చాపర గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 1న 'ఆంధ్రజ్యోతి'లో 'కిడ్నీ వ్యాధి కబళిస్తోంది' శీర్షికతో ప్రచురితమైన కథనంపై సంబంధిత అధికారులు స్పందించారు. ఇందులో భాగంగా ఉద్దానం నీటిని చాపర గ్రామానికి తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. శనివారం ఆ గ్రామాన్ని ఉద్దానం పథకం డీఈ ఆశలత సందర్శించి, కొత్త ట్యాంకుల నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. గ్రామంలో 30 ఎళ్ల కిందట నిర్మాణం చేసిన నీటి ట్యాంకులు ద్వారా నీరు వస్తుడడంతో కలుషితం కావటం వల్ల కిడ్నీ వ్యాధి ప్రబలుతుందని గ్రామస్థులు తెలుపుడడంతో కొత్త ట్యాంకు ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు చెబుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి


వినతిపత్రం అందిస్తున్న సంఘ ప్రతినిధులు

నరసన్నపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతానికి చర్యలు తీసుకోవాలని, కేంద్రాలను ప్రభుత్వపాఠశాలలో విలీనం నిలుపుదల చేయాలని సీఐటీయూ అధ్యక్షుడు అమ్మన్నాయుడు, కోశాధికారి అల్లు సత్యనారాయణ అన్నారు. శనివారం దేశవానిపేట సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ప్రీస్కూల్ పిల్లలకు యూనిఫాం, బూట్లు, నాణ్యమైన భోజన సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పి.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షుడిగా సద్గుణబాబు


నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్న దృశ్యం

పలాసరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పలాస మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా రెంటికోట పంచాయతీ కార్యదర్శి పి.సద్గుణబాబు, ఉపాధ్యక్షుడిగా బమ్మిడి రేవతిపతి (అమలకుడియా పంచాయతీ) శనివారం ఎన్నుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. సహాయ ప్రధాన కార్యదర్శిగా సుధాకర్ (తర్లాకోట పంచాయతీ), కోశాధికారిగా వి.జీవన్(అల్లుకోల పంచాయతీ), సహాయ కోశాధికారిగా జి.ఖగేశ్వరరావు(పెదంచల పంచాయతీ), సభ్యులుగా ఎన్.మీనాకుమారి, డి.రవికుమార్, సార అప్పారావు, ఆశలను ఎన్నుకున్నారు.

ఆరోగ్యవంతమైన సమాజం అవసరం



ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పట్టణంలో ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రేణుకాదేవి, ఎంఈవోలు తులసీరావు, చిన్నారావు, కార్యదర్శి ఏవీ శ్రీనివాస్, బగాది ప్రసాద్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బిర్సా ముండా జయంతి

మెళియాపుట్టి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గిరిజన యోధుడు బిర్సా ముండా జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజనులు హక్కుల కోసం పోరాటం చేసిన యోధుడు బిర్సా ముండా అని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్‌పండా, సిబ్బంది, గిరిజనులు తదితరులు ఉన్నారు.

వ్యాస రచన పోటీల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

పలాస రూరల్, నవంబరు 15(ఆంధ్ర జ్యోతి): రామకృష్ణాపురంలో గల శ్రీసత్య సాయి విద్యావిహార్ పాఠశాల విద్యార్థుల రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపారు. సత్యసాయిబాబా శతవార్షిక జయంతి సందర్భంగా శ్రీసత్యసాయి సేవాసంస్థలు ఆంగ్ల, తెలుగు భాషాల్లో డ్యూటీ ఇస్ గాడ్ అనే అంశంపై వ్యాస రచన పోటీలు రాష్ట్రస్థాయిలో నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన కుమ్మరి విజయ్ (8వ తరగతి) తెలుగు విభాగంలో మూడో స్థానం, ఆంగ్లభాష విభాగంలో బల్ల సిద్ధిక(10వ తరగతి) ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా శనివారం ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి విద్యార్థులను సత్కరించారు. శ్రీసత్యసాయి సేవా సంస్థల సభ్యులు జామి శ్రీనివాస్, తాళాసు శ్రీను, ఉపాధ్యాయులు అనుదీప్, మురళి, దంతేశ్వరి, మమత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు జిల్లా జట్టు


పోటీలకు ఎంపికైన జిల్లా జట్టుతో నిర్వాహకులు, పీఈటీలు

పలాస, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మందస మండలం సొండిపూడి జడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 21, 22 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-14 టెన్నికాయిట్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక శనివారం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన ఈ ఎంపికల్లో బాలుర విభాగం నుంచి కె.జయంత్, ఎస్.చరణ్‌రెడ్డి, కె.గౌతమ్, బి.జశ్వంత్, బాలికల విభాగం నుంచి ఎస్.దివ్య, కె.బిందుమాధవి, కె.వసుంధర, టి.భువన ఎన్నికయ్యారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.తవిటయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికల్లో హెచ్ఎం పి.రవికుమార్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లా సంతోష్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావు పాల్గొనగా న్యాయనిర్ణేతలుగా ఎం.దామోదర్, లండ దిలీప్ వ్యవహరించారు.

గురుకులాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

నరసన్నపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలు, కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించేలా వందరోజులు ప్రణాళిక అమలు చేయాలని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులాల జిల్లా కోర్డినేటర్ వై. యశోదలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక తామరాపల్లి గురుకుల కళాశాలలో నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యాక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్వీ కృష్ణతార, వైస్ ప్రిన్సిపాల్ ఎం. రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

జలుమూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విధుల్లో అలసత్వం వహిస్తే చర్యల తప్పవని ఎంపీడీవో బి.చిన్నమ్మడు హెచ్చరించారు. తన కార్యాలయంలో శనివారం గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. తహసీల్దారు జె.రామారావు, పలువురు వీఆర్వోలు, కార్యదర్శులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం


అవగాహన ర్యాలీలో పాల్గొన్న డీఎల్‌పీవో రమణ

ఎల్ఎన్ పేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని టెక్కలి డివిజన్ డీఎల్‌పీవో ఐవీ రమణ తెలిపారు. రావిచెంద్రి గ్రామంలో శనివారం జరిగిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వీధుల్లో పర్యటించి పారిశుధ్యం మెరుగు, పరసరాల పరిశుభ్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ కె.లక్ష్మునాయుడు, కార్యదర్శి ఊర్వశి, మాజీ జడ్పీటీసీ ఎస్.తేజేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బాలింత మృతి


శ్రీవాణి (ఫైల్)

జలుమూరు (సారవకోట), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బుడితి సీహెచ్‌సీలో డెలివరీ జరిగిన ఓ బాలింత నరసన్నపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు బుడితి గ్రామానికి చెందిన శిమ్మ శ్రీవాణి(24) రెండో డెలివరీ కోసం బుడితి సీహెచ్‌సీలో ఈనెల 11న జాయిన్ అయింది. గైనకాలజిస్టు ప్రతిభ చైతన్య శస్త్రచికిత్స చేయడంతో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. అయితే శ్రీవాణికి అప్పటి నుంచి ఓవర్ బ్లీడింగ్ అవుతుండడంతో 14న శుక్రవారం మెరుగైన చికిత్స కోసం నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడా పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు నరసన్నపేటలో గల ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతి చెందింది. కాగా మొదటి కాన్పులో పాపకు జన్మనిచ్చిన శ్రీవాణి రెండో కాన్పులో బాబుకి జన్మనిచ్చింది. అయితే మొదటి కాన్పులో శస్త్రచికిత్స చేసినప్పుడు సమస్య ఉత్పన్నమైందని, ఈ విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులు వైద్యులకు చెప్పకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. శ్రీవాణి కన్నవారిది కిన్నెరవాడ గ్రామం కాగా, అత్తవారు బుడితి. భర్త శిమ్మ సూర్యనారాయణ ఉన్నారు. ఈ విషయమై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

డీవీఈవో ఆకస్మిక తనిఖీ

నందిగాం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఆర్.సురేష్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. తరగతి గదుల్ని సందర్శించి సబ్జెక్ట్ వారీగా బోధనపై ఆరాతీశారు. అలాగే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వివిధ అంశాలపై ప్రిన్సిపాల్ ఎం.కృష్ణమోహన్‌ను అడిగి తెలుసుకున్నారు.

ముగిసిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ

టెక్కలి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజుల పాటు నిర్వహించిన అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ శనివారంతో ముగిసింది. మేథోసంపత్తి రక్షణ, హక్కులు, నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవడం, సృజనాత్మక ఆవిష్కరణలు, వ్యాపార ప్రారంభాలు వంటివి అవసరమని డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో శివ శంకరరాజు, పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డాక్టర్ శ్రీహరి, డాక్టర్ శ్రీరాములు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగాపై..

కోటబొమ్మాళి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నటరాజ్ యోగా సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ఓ ప్రైవేట్ స్కూల్ ఆవరణలో ఆదివారం నుంచి ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని నటరాజ్ యోగా సొసైటీ సభ్యులు మద్ది రామారావు శనివారం తెలిపారు. యోగా ఇన్‌స్ట్రక్టర్ స్వామినాయుడు బోధన, పర్యవేక్షణలో సంపూర్ణ ఉచిత యోగా శిక్షణ ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 5.45 నుంచి 7 గంటల వరకు 15 రోజుల పాటు ఈ శిక్షణ ఉచితంగా ఇవ్వనున్నట్టు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శ్రీకాకుళం రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాగోలు గ్రామంలో శనివారం పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్ఐ కె.రాము తెలిపారు. వారి నుంచి రూ.13,140 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

ధర్నాను విజయవంతం చేయండి

వజ్రపుకొత్తూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ఈ నెల 18న పలాస ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఎయిర్‌పోర్టు వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు కె.వాసు, కార్యదర్శి జోగి అప్పారావు కోరారు. ఈ మేరకు శనివారం మండలంలో గల ఒంకులూరు, కొండగుడ్డి, అనకాపల్లి గ్రామాల్లో పర్యటించి కరపత్రాలను ఆవిష్కరించారు.

ఆక్రమణలు అడ్డగింత

పలాస, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక హుద్‌హుద్ కాలనీకి సమీపంలో ఆక్రమణను రెవెన్యూ అధికారులు శనివారం సాయంత్రం అడ్డుకున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు యంత్రాల సాయంతో హుద్‌హుద్ గృహాల ప్రారంభోత్సవం నాడు వేసిన శిలాఫలకాన్ని ఆనించి ఉన్న కొద్దిపాటి స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నించాడు. స్థానికులు గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేయడంతో సిబ్బంది వచ్చి అడ్డుకున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో ఎటువంటి పట్టాలు లేకుండా నివాసాలు వెలశాయి. మండలానికి సంబంధించిన వారు కాకుండా ఇతర మండలాల ప్రజలు పట్టాలు పొంది గృహాలు నిర్మించుకుంటున్నారు. మొత్తం వ్యవహారంపై అధికారులు సమగ్ర దర్యాప్తు చేసి అర్హత ఉన్నవారికి పట్టాలు ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన మహా మృత్యుంజయ యాగం


యాగంలో పాల్గొన్న భక్తులు

కోటబొమ్మాళి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో గత మూడు రోజులుగా జరుగుతున్న మహా మృత్యుంజయ యాగం శనివారంతో ముగిసింది. కోటబొమ్మాళితో పాటు పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వేదపండితులు నుసరాపు గణపతిశర్మ, అంపోలు రుద్రకోటేశ్వర శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈవో వాకచర్ల రాధాకృష్ణ పర్యవేక్షించారు.

శ్రీముఖలింగేశ్వరునికి గ్రామోత్సవం



జలుమూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలో వెలసిన శ్రీముఖలింగేశ్వరస్వామి గ్రామోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకిలో ఉంచి ఊరేగించారు. అర్చకులు నారాయణమూర్తి, ఎస్వీ చలం, శివ, శ్రీకృష్ణ, అప్పారావు, అచ్యుత, యోగి పలువురు భక్తులు పాల్గొన్నారు.

సిద్ధాశ్రమంలో లక్ష దీపారాధన


లక్ష దీపారాధనలో పాల్గొన్న మహిళలు

నరసన్నపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సిద్ధాశ్రమంలో లక్షదీ పారాధన శనివారం వైభవంగా నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, మండపారాధన, యాగం చేపట్టారు. అనంతరం మహిళలచే లక్షదీపారాధన చేపట్టారు. ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


ఎల్ఎన్ పేట: పూజలు చేస్తున్న భక్తులు

- ఎల్ఎన్ పేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తాయిమాంబపురం (గార్లపాడు) ఆర్ ఆర్‌కాలనీలోని కోదండ రామస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులు అభిషేకాలు చేశారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న భక్తులు

వజ్రపుకొత్తూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రిట్టపాడులో వెలసియున్న వేంకటేశ్వర స్వామి ఆలయ 29వ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పండితుల వేదమంత్రోచ్చరణ నడుమ భక్తులు స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సన్నిధిలో భక్తులు వేంకటేశ్వరస్వామి వ్రతాలను చేపట్టారు. మధ్యాహ్నం జరిగిన అన్నప్రసాద వితరణ చేపట్టారు.

సర్వే పారదర్శకంగా చేపట్టాలి

జలుమూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి నెలాఖరు వరకు ఇంటింటా చేపడుతున్న ఎల్సీడీసీ సర్వే పారదర్శకంగా చేపట్టాలని జలుమూరు వైద్యాధికారి మూల సంధ్యారాణి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో శనివారం నిర్వహించిన ఆశా వర్కర్ల సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సర్వేలో శరీరంపై ఉన్న అనుమానాస్పద మచ్చలు, స్పర్శలేని మచ్చలు కనిపిస్తే అటువంటి వ్యక్తులను గుర్తించి ఆసుపత్రిలో తనిఖీ నిర్వహించాలన్నారు. వైద్యాధికారి పరిశీలించి మచ్చలు తీవ్రతను బట్టి ఉచితంగా మందులు అందచేస్తారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి చిన్నరాజులు, పలువురు ఏఎన్ఎంలు, ఆశాలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.